ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293


VIGNAN PATRIKA
APTEL/2024/89102
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 76 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం 18 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02




మోదీ సర్కారుకు పార్లమెంటులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేసేందుకు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 816 పెంచేందుకు కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. ముందునుంచీ ఊహించినట్టుగానే బిల్లు ఆమోదానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని అధికార పక్షం సాధించలేకపోయింది. శుక్రవారం సాయంత్రం లోక్‌సభలో చేపట్టిన కీలక ఓటింగ్‌లో మొత్తం 540 మంది సభ్యులకు గాను 528 మంది పాల్గొన్నారు. బిల్లు ఆమోదానికి 352 ఓట్లు రావాల్సి ఉండగా 298 మంది మాత్రమే అనుకూలంగా ఓటేశారు. 230 మంది విపక్ష సభ్యులు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. దాంతో సవరణ బిల్లు వీగిపోయినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం బిల్లును ఉపసంహరించుకుంటున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. దానితో పాటుగా ప్రవేశపెట్టిన డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సవరణ బిల్లులను కూడా వెనక్కు తీసుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. ఆ రెండు బిల్లులూ రాజ్యాంగ సవరణ బిల్లుతోనే ముడిపడి ఉన్నందున వాటిని ముందుకు తీసుకెళ్లే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో పార్లమెంటులో ఒక బిల్లు వీగిపోవడం ఇదే తొలిసారి! ఈ నేపథ్యంలో మోదీ సర్కారు లోక్‌సభ స్థానాల పెంపు యత్నాలకు తాత్కాలికంగా తెర పడినట్టే. సవరణ బిల్లువీగిపోయినంత మాత్రాన నిరాశ చెందబోమని, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల సత్వర అమలుకు తమ ప్రభుత్వం కృషి చేస్తూనే ఉంటుందని రిజిజు పేర్కొన్నారు. కాంగ్రెస్, తృణమూల్, సమాజ్‌వాదీ, డీఎంకే తదితర పక్షాలు ఎంతటి మహిళా వ్యతిరేకులో ఈ ఉదంతం మరోసారి రుజువు చేసిందంటూ కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు దుయ్యబట్టారు. మహిళా బిల్లు ముసుగులో స్వీయ రాజకీయ లబ్ధి కోసం లోక్‌సభ నియోజకవర్గాలను పెంచుకోవాలన్న బీజేపీ కుట్రలకు అడ్డుకట్ట పడిందని కాంగ్రెస్ తదితర పార్టీలు చెప్పుకొచ్చాయి. 2029 లోక్‌సభ ఎన్నికల్లోనే గాక దేశవ్యాప్తంగా ఇకపై జరగబోయే అన్ని ఎన్నికల్లోనూ విపక్షాలు మహిళల ఆగ్రహ జ్వాలలను చవిచూడక తప్పదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. సవరణ బిల్లును విపక్షాలు ఓడించడాన్ని బీజేపీ మహిళా ఎంపీలు తీవ్రంగా నిరసించారు. శుక్రవారం సాయంత్రం లోక్‌సభ వాయిదా పడ్డ అనంతరం పార్లమెంటు ఆవరణలో వారు ధర్నాకు దిగారు. 'మహిళలకు జరిగిన అవమానాన్ని భారత్ సహించబోదు' అంటూ ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. కేంద్ర మంత్రులు శోభా కరంద్లాజె, అన్నపూర్ణా దేవి, రక్షా ఖడ్సే, ఎంపీ కంగనా రనౌత్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

# హోర్ముజ్ తెరిచాం




## బిల్లులను అడ్డుకున్న పార్టీలు ఏం సాధించాయి?

'ఎక్స్' ఖాతాలో గణాంకాలతో మాజీ సీఎం వైఎస్ జగన్ పోస్టు
ఇటు మహిళా బిల్లు సాకారం కాలేదు.. అటు దక్షిణాదికి న్యాయం జరగలేదు.. దీనిపై ఆ పార్టీలే ఆత్మ విమర్శ చేసుకోవాలి
50 శాతం సీట్ల పెంపే దక్షిణాది రాష్ట్రాలకు ప్రయోజనకరం
2011 జనాభా లెక్కలతో నష్టం.. 2026 జనాభా లెక్కలు అమలైతే మరింత నష్టం
బిల్లులను అడ్డుకోవడంతో దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు తగ్గే ప్రమాదం




## జెన్‌జీ రూటు ఎటో!

తమిళనాడులో 1.18 కోట్ల మంది యువ ఓటర్లు
వారిని ప్రసన్నం చేసుకునేలా రాజకీయ పార్టీల వ్యూహాలు
ఆకర్షణకు డిజిటల్ వాగ్దానాలు
23న అసెంబ్లీ పోలింగ్
జెన్ జెడ్‌ను ఆకర్షించేలా రాజకీయ పార్టీల వ్యూహాలు
సమస్యల ఆధారిత ఓటింగ్



## నాకెవరూ సిఫార్సు చేయలేదు

- కష్టపడ్డ వారిని గుర్తించి పదవులిచ్చా: సీఎం చంద్రబాబు
- తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో క్లస్టర్ ఇన్‌ఛార్జీలతో 'కాఫీ కబుర్లు' పేరుతో కార్యక్రమం
- పని చేసేవారికి గౌరవం, గుర్తింపు తప్పకుండా లభిస్తుందని భరోసానిచ్చిన సీఎం చంద్రబాబు
- కేడర్‌ను పట్టించుకునే పార్టీ టీడీపీ



## రాజ్యాంగం కంటే మనువాదం అమలుకే కుట్ర

ఎన్నికల మ్యాప్‌ను మార్చేందుకు బీజేపీ యత్నం
దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యం కొల్లగొడుతున్నారు : ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
ప్రధాని మోడీ ఓ ఇంద్రజాలకుడు
రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించిన డీఎంకే
డీలిమిటేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నమ్మాలి :



# నారీ.. సారీ

**పార్లమెంటు ప్రత్యేక భేటీ :** మహిళా రిజర్వేషన్ల సత్వర అమలుకు వీలుగా 'నారీ శక్తి వందన్ అధినియమ్' చట్టానికి మోదీ సర్కారు కీలక సవరణలు చేపట్టింది. అందుకోసం రూపొందించిన మూడు బిల్లుల ఆమోదానికి పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరిచింది. రాజ్యాంగ (131వ సవరణ), డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట (సవరణ) బిల్లులను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేయాలని, అందుకోసం లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుత 543 నుంచి 816కు పెంచాలని, అందుకు 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోవాలని రాజ్యాంగ సవరణ బిల్లులో కీలక ప్రతిపాదనలు చేసింది.

మూడు బిల్లులపై గురువారం నుంచి శుక్రవారం సాయంత్రం దాకా లోక్‌సభలో 18 గంటలకు పైగా సుదీర్ఘ చర్చ జరిగింది. 130 మందికి పైగా ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం శుక్రవారం సాయంత్రం రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును సభ ఓటింగ్‌కు చేపట్టింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు విపక్ష నేత రాహుల్‌గాంధీ కూడా సభలో ఉన్నారు. బిల్లు వీగిన అనంతరం రిజిజు మాట్లాడుతూ ఇది పూర్తిగా విపక్షాల పాపమేనన్నారు. దేశ మహిళలను గొప్పగా గౌరవించుకునే సువర్ణావకాశాన్ని అవి కోల్పోయాయంటూ ఆక్షేపించారు.

"కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి. దేశ మహిళలు ఆ పార్టీని ఎప్పటికీ క్షమించరు" అంటూ దుయ్యబట్టారు. మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించేదాకా తమ ప్రభుత్వం విశ్రమించబోదని మంత్రి చెప్పారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచే బిల్లును ఓడించి కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు సంబరాలు చేసుకోవడం దారుణమని అమిత్ షా ఆక్షేపించారు. మహిళల పట్ల వారి వివక్షకు ఇది అద్దం పట్టిందన్నారు. రాజ్యాంగంపై మోదీ సర్కారు తలపెట్టిన దాడిని మాత్రమే తాము ఓడించామని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు.

**ఎన్డీఏకు 'ఐదు' అదనం 'ఇండియా'కు 3 తక్కువ :** మహిళా చట్ట సవరణ బిల్లుపై చేపట్టిన ఓటింగ్‌లో అధికార ఎన్డీఏ కూటమికి దాని పూర్తి బలం కంటే 5 ఓట్లు అదనంగా రావడం విశేషం. అదే సమయంలో విపక్ష ఇండియా కూటమికి మొత్తం బలం కంటే 3 ఓట్లు తగ్గాయి. ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షాలన్నింటికీ కలిపి 293 మంది, ఇండియా కూటమి పార్టీల్లో 233 మంది ఎంపీలున్నారు. అయితే ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లొచ్చాయి. వ్యతిరేకంగా 230 ఓట్లు పడ్డాయి.

# జెన్‌జీ రూటు ఎటో..!

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో జెన్‌జీ(జనరేషన్ జెడ్) నిర్ణయాత్మక శక్తిగా అవతరించింది. యువతరం తమిళ రాజకీయాల్లో పెద్దమార్పునకు పునాది కాబోతుంది. 1.18 కోట్ల మంది యువ ఓటర్లు ఉండడంతో రాజకీయ పార్టీలు వారిని ఆకర్షించే పనిలో పడ్డాయి. తమిళనాడులోని మొత్తం ఓటర్లలో సుమారు 20 శాతం అంటే 1.18 కోట్ల మంది 1997 నుంచి 2012 మధ్య జన్మించిన జెన్‌జీ ఓటర్లే ఉన్నారు. వీరి ఓట్లు గెలుపోటములను శాసించడంలో కీలక భూమిక పోషించనున్నాయి.

**జెన్ జెడ్‌ను ఆకర్షించేలా రాజకీయ పార్టీల వ్యూహాలు :** జెన్--జెడ్ ఓటర్లను ఆకర్షించే వ్యూహాలకు తమిళ రాజకీయ పార్టీలు పదునుపెట్టాయి. డీఎంకే ఆధునిక డిజిటల్ ప్రచారంలో నిమగ్నమైంది. ప్రభుత్వం కొనసాగింపు, అభివృద్ధి నినాదం ఇందులో కీలకంగా ఉంది. యువఓటర్లను ఆకర్షించే విధంగా ఉచిత ల్యాప్ టాప్‌లు, వైఫై సేవలు, ఉద్యోగకల్పన, ఉన్నతచదువుల కోసం నాన్ మొదల్వన్ పథకం ద్వారా ఉచిత వృత్తి శిక్షణ, పోటీ పరీక్షలకు శిక్షణే కాకుండా, పుదుమైపెన్, తమిళ్‌పుదల్వన్ పథకాల పేరిట నెలకు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. అన్నాడీఎంకే విషయానికి వస్తే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉన్నత చదువుల్లో రిజర్వేషన్లను 7.5% నుంచి 10%కి పెంచుతామని, ఆర్థిక సంక్షేమ పథకాల భరోసాను కీలకంగా చేసుకుంది. తమిళ వెట్రి కళగం అధ్యక్షుడు, నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రంతో యువత, అభిమానుల్లో భారీ అంచనాలు పెరిగాయి. అందుకే విజయ్ ఈ తరం కోసం ఏఐ టెక్నాలజీ, ఫీజులమాఫీ అంటూ ముందుకు సాగుతున్నారు. నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ అయితే తమిళ దేశం నిర్మాణం తదితర భావోద్వేగ అంశాలతో జెన్‌జీ ఓటర్ల కోసం కీలక ప్రకటనలు చేశారు. మునుపటి తరాల మాదిరిగా ఒక పార్టీకి వంశపారంపర్య విధేయులుగా ఉండకుండా, జెన్--జీ ఓటరు తాజాగా స్పష్టమైన నిర్ణయంతో ఉన్నారని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

**సమస్యల ఆధారిత ఓటింగ్ :** పార్టీల కంటే సమస్యలకే జెన్‌జీ ఓటర్లు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తాజా అంచనాలు చెబుతున్నాయి. నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, మెరుగైన భవిష్యత్తు, సమాచార మూలాల విశ్లేషణకు జెన్‌జీ వార్తాపత్రికలతో పాటు సోషల్ మీడియా ద్వారా రాజకీయ అవగాహన పెంచుకుంటున్నారు. ఈ దృష్ట్యా యువ ఓటర్లు ఏకపక్షంగా ఉండకుండా చీలిపోయే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఎన్నికలు కేవలం అధికార మార్పిడి కోసం మాత్రమే కాదు. రాబోయే 20 ఏళ్ల తమిళనాడు రాజకీయ గమనాన్ని నిర్ణయించే కొత్త తరం గళం కాబోతోంది.

# నాకెవరూ సిఫార్సు చేయలేదు

జగన్ ఇంట్లో ఉంటే ఆయన ఇంటి వరకే నష్టమనీ కానీ రాజకీయాల్లో ఉంటే రాష్ట్రానికి నష్టమని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ నాయకులు పొట్టేళ్లను నరికి రక్తాభిషేకాలు చేస్తున్నారని అధికారంలోకి వస్తే 'రప్పా రప్పా నరుకుతాం' అని పోస్టర్లు పెడుతున్నారని మండిపడ్డారు. ఇదీ వాళ్ల సంస్కృతి అని చంద్రబాబు దుయ్యబట్టారు. వాళ్ల అరాచకాలు, దుర్మార్గాల్ని క్షేత్రస్థాయిలో వివరించాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్?లో క్లస్టర్ ఇన్‌ఛార్జీలతో 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. పనితీరు ప్రతిపదికగా ఒక మండలాధ్యక్షురాలిని, క్లస్టర్ ఇన్‌ఛార్జిని పార్టీలో అత్యున్నతమైన పొలిట్‌బ్యూరోలోకి తీసుకున్నామని సీఎం వివరించారు. కార్యకర్తే అధినేత అన్న విధానానికి ఇదే నిదర్శనమన్నారు. పొలిట్‌బ్యూరోలోకి తీసుకోవాలని తనకెవరూ సిఫార్సు చేయలేదని పార్టీ కోసం వారుపడ్డ కష్టాన్ని గుర్తించి పదవులిచ్చామని చంద్రబాబు వెల్లడించారు. పని చేసేవారికి గౌరవం, గుర్తింపు తప్పకుండా లభిస్తుందని భరోసానిచ్చారు. ఎన్నికలకు ముందు పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలు, ఎన్నికల మ్యానిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లారని నేతలకు దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి వచ్చాక ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఆ హామీల్ని అమలు చేశామని గతంలో కంటే రెట్టింపు సంక్షేమం అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ప్రభుత్వం ఏ పని చేసినా దాని ఫలితం పార్టీకే దక్కుతుందని 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజామోదం ఉన్నవారికే టికెట్లు ఇచ్చామని గుర్తుచేశారు. ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశామని గుర్తుచేశారు. ఫలానా వాళ్లు గెలవరనుకుంటే తనకు సన్నిహితంగా ఉన్నా సరే టికెట్టు ఇవ్వలేదన్నారు.

**కేడర్‌ను పట్టించుకునే పార్టీ టీడీపీ:** స్థానికసంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి నాయకత్వానికి సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. వివిధ సర్వేల ద్వారా ప్రజాప్రతినిధుల పనితీరు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు గురించి తెలుసుకుంటున్నట్లు వెల్లడించారు. నాయకులు ప్రజలకు నష్టం కలిగించే పనులు చేసినా, కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గినా పార్టీకి నష్టమన్నారు. బలమున్న నియోజకవర్గాన్ని అసమర్థ నాయకుడి చేతిలో పెడితే ఓటమి ఖాయమని హెచ్చరించారు. మంచి నాయకుడ్ని బలహీన నియోజకవర్గానికి పంపిస్తే పార్టీ గెలుస్తుందని చంద్రబాబు ఉద్ఘాటించారు. కార్యకర్తలు నిత్య విద్యార్థుల్లా ఉండాలని సూచించారు. జీవితాంతం నేర్చుకోవాలన్న సీఎం తనకే తెలుసనుకుంటే అక్కడితోనే ఆగిపోతారని హితవుపలికారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. వీలైనంత మంది కార్యకర్తల్ని ఈ-3 (ఎథిక్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) ద్వారా ఆర్థికంగా పైకి తీసుకొస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీని లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలికిన వాళ్లే కాలగర్భంలో కలిసిపోయారని గుర్తుచేశారు. కేడర్‌ను పట్టించుకునే పార్టీ టీడీపీ అని స్పష్టంచేశారు. తొలి నుంచీ ఇది పార్టీ సంస్కృతిలో భాగమని తెలిపారు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యకర్తల పిల్లల్ని చదివిస్తున్నామని గుర్తుచేశారు. జలధార కార్యక్రమంలో భాగంగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టామని దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. రాష్ట్రమంతటా మే 15వ తేదీకే పంటలకు నీళ్లివ్వబోతున్నామని చంద్రబాబు తెలిపారు. కార్యకర్తలకిస్తున్న యోగా శిక్షణపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

# రాజ్యాంగం కంటే మనువాదం అమలుకే కుట్ర

ఇది మహిళా బిల్లు కాదని, 2023లోనే పార్లమెంటులో బిల్లును ఆమోదించారని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగం కంటే మనువాదం అమలుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల మ్యాప్‌ను మార్చేందుకు యత్నిస్తోందని విమర్శించారు. శుక్రవారం మహిళా రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు-2026, డీలిమిటేషన్ (పునర్విభజన) బిల్లు-2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులపై లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యం కొల్లగొడుతున్నారని, అధికారంలో దళిత హిందువులకు వాటా లేకుండా చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శలు గుప్పించారు. డీలిమిటేషన్‌పై దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు భయపడాల్సిన పని లేదని, ప్రభుత్వం వారి హక్కులను లాక్కునేందుకు తాము అనుమతించబోమని స్పష్టం చేశారు. ఓబీసీలను దూరంగా ఉంచి, వారి హక్కులను కొల్లగొట్టేందుకే బీజేపీ కులగణనను బైపాస్ చేసే ప్రయత్నం చేస్తోందని తప్పుపట్టారు.

సమాజంలో మహిళలది కీలక పాత్ర అని రాహుల్ పేర్కొన్నారు. మహిళలకు దేశ ఛోదక శక్తి అని ప్రధాని చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. తమ ఇద్దరికీ ఎలాంటి 'వైఫ్ ఇష్యూస్' లేవని చమత్కరించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ఇప్పుడు చేపట్టడం వెనుక ఉన్న ఉద్దేశం చిక్కుప్రశ్నతో ముడిపడి ఉన్నదని ఆయన వివరించారు. ప్రధాని మోదీ ప్రసంగం చాలా శక్తి హీనంగా, విచ్ఛిన్నంగా ఉన్నదని అన్నారు. '' మోడీ చర్చల్లో పాల్గొనలేకపోయారు. ఎందుకంటే ఈ బిల్లును ఆమోదింపజేయడానికి ప్రయత్నించడం ఒక పొరపాటు. అది నెగ్గదని, తీవ్ర భయాందోళనలకు గురవుతుందని అందరికీ తెలుసు' అని రాహుల్‌గాంధీ అన్నారు. అయితే, అదే తనకు జ్ఞానోదయం కలిగించిన క్షణమని ఆయన తెలిపారు. 'నేను ఆయన్ను (మోడీని) చూస్తున్నప్పుడు, నా ఫోన్‌లో ఏప్రిల్ 16న గమనించా. అప్పుడు నేను, 'దేవుడా, ఎంత విచిత్రం. అదే ఆ సంఖ్య. 16! ఈ పదహారు సంఖ్య, ఇదే ఆ సంఖ్య. ఈ చిక్కుముడికి పూర్తి సమాధానం 16 సంఖ్యలోనే ఉన్నది. ప్రతీదీ పదహారు సంఖ్యలోనే ఉన్నదని అనుకున్నా' అని రాహుల్‌గాంధీ అన్నారు. మరోవైపు తాను చెప్పేది ఎవరికైనా అర్థమైతే, దయచేసి తనకు మెసేజ్ పంపాలని కోరారు. 'ఆ చిక్కుముడి ఏమిటో మీరు ట్విట్టర్‌లో కూడా చెప్పవచ్చు. కానీ మీ ప్రశ్నలకు సమాధానం, ఆ చిక్కుముడి గురించి మీరు త్వరలోనే తెలుసుకుంటారు. పదహారు సంఖ్యలోనే అంతా ఉన్నది' అని వ్యాఖ్యానించారు.

ప్రధాని మోడీ ఓ ఇంద్రజాలకుడు

ప్రధాని నరేంద్ర మోడీని ఓ ఇంద్రజాలకుడితో రాహుల్ గాంధీ పోల్చారు. బాలాకోట్ దాడులు.. డీమానిటైజేషన్.. ఆపరేషన్ సింధూర్ ఇంద్రజాలకుడు మోడీ అని రాహుల్ విమర్శించారు. దీనిపై బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డిమాండ్ చేశారు. మోడీపై చేసిన వ్యాఖ్యలు ఖండించదగ్గవని ఆయన అన్నారు.

రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించిన డీఎంకే

లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును డీఎంకే వ్యతిరేకించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎంపీ కనిమొళి మాట్లాడారు. ఒకవేళ డీలిమిటేషన్ బిల్లు సరైన దశలోనే ఉండి ఉంటే, ఆ బిల్లును తమిళనాడు అసెంబ్లీలో ఎందుకు ప్రవేశపెట్టడం లేదని ఆమె ప్రశ్నించారు. డీలిమిటేషన్ అంశంపై ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రితోనూ కేంద్రం సంప్రదించలేదని అన్నారు. 2021లో జనాభా లెక్కలను ప్రభుత్వం వాయిదా వేసిందని, ఇప్పుడు వాటి స్థానంలో పాత జనాభా లెక్కలను తీసుకుంటున్నారని, ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయని, ఓ రెండు వారాల పాటు ఆగే ఆలోచనలో బీజేపీ లేదని, ఎన్నికల రెస్క్యూ వ్యూహం తరహాలో మహిళలను బీజేపీ వాడుకుంటున్నదని కనిమొళి ధ్వజమెత్తారు. గురువారం లోక్‌సభలో ఎందుకు 2023 నాటి మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నోటిఫై చేశారని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్‌ను తప్పుదోవ పట్టించే రీతిలో బిల్లు ఉన్నదని, ఇది దేశ ఫెడరల్ విధానాన్ని దెబ్బతీస్తున్నట్టుగా ఉందని అన్నారు. బిల్లులను ప్రవేశపెట్టి, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించాలని కోరడం, గుణాత్మక రాజకీయం అవుతుందని అన్నారు. మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం ఓ ట్రాప్ అని, మహిళలను బీజేపీ ఓ కవచంలా వాడుకుంటోందని కనిమొళి అన్నారు. ప్రస్తుతం ఉన్న 543 స్థానాల్లో ఎందుకు రిజర్వేషన్ ఇవ్వలేకపోతున్నారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ఆమె ప్రశ్నించారు.

# బిల్లులను అడ్డుకున్న పార్టీలు ఏం సాధించాయి?

'కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన ద్వారా ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపుదలను ఆమోదించి ఉంటే దక్షిణాది రాష్ట్రాలకు ఎంపీ సీట్లూ పెరిగేవి... మహిళా రిజర్వేషన్ బిల్లూ ఆమోదం పొందేది..' అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ ఆ బిల్లులను లోక్‌సభలో అడ్డుకున్న పార్టీలు తాము ఏం సాధించామో నిశితంగా ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న పార్టీల చర్యతో దేశంలో మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకూ న్యాయం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు తగ్గిపోయే ప్రమాదం ఏర్పడటంతోపాటు మహిళా రిజర్వేషన్ బిల్లు వాయిదా పడిందన్నారు. ఒకవేళ 2026 జనాభా లెక్కలే అమలైతే దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై తన అభిప్రాయాన్ని వైఎస్ జగన్ శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు ద్వారా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపుదల విధానంలో దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు పెరిగేవి. అదే 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు తగ్గుతాయి. ఇక 2026 జనాభా లెక్కలు అమలులోకి వస్తే దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి మరింతగా దిగజారుతుంది. కుటుంబ నియంత్రణను సమర్థంగా అమలు చేసినందుకు జనాభా పెరుగుదల తగ్గిన దక్షిణాది రాష్ట్రాలు మరింతగా నష్టపోతాయి. 50 శాతం సీట్ల పెంపుదల విధానాన్ని అమలు చేస్తే ప్రస్తుతం ఏపీలో ఉన్న 25 ఎంపీ సీట్లు 38 సీట్లకు పెరుగుతాయి. అదే 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఎంపీ సీట్లు 34 మాత్రమే అవుతాయి. అంటే ఏపీ 4 ఎంపీ సీట్లు నష్టపోతుంది. 50 శాతం సీట్ల పెంపుదల విధానం అమలు చేస్తే ప్రస్తుతం తెలంగాణలో ఉన్న 17 ఎంపీ సీట్లు 26 సీట్లకు పెరుగుతాయి. అదే 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఎంపీ సీట్లు 24 మాత్రమే అవుతాయి. అంటే రెండు సీట్లు నష్టపోవాలి. 50 శాతం సీట్ల పెంపుదల విధానం అమలు చేస్తే ప్రస్తుతం కర్ణాటకలో ఉన్న 28 ఎంపీ సీట్లు 42 స్థానాలకు పెరుగుతాయి. అదే 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకున్నా ఆ రాష్ట్రంలో 42 ఎంపీ సీట్లే ఉంటాయి. అంటే ఆ రాష్ట్రం ఏమీ నష్టపోదు. 50 శాతం సీట్ల పెంపుదల విధానం అమలు చేస్తే ప్రస్తుతం కేరళలో ఉన్న 20 ఎంపీ సీట్లు 30 సీట్లకు పెరుగుతాయి. అదే 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఎంపీ సీట్లు 23 మాత్రమే అవుతాయి. అంటే కేరళ 7 ఎంపీ సీట్లు నష్టపోతుంది. 50 శాతం సీట్ల పెంపుదల విధానం అమలు చేస్తే ప్రస్తుతం తమిళనాడులో ఉన్న 39 ఎంపీ సీట్లు 59 సీట్లకు పెరుగుతాయి. అదే 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఎంపీ సీట్లు 50 మాత్రమే అవుతాయి. అంటే తమిళనాడు 9 ఎంపీ సీట్లు నష్టపోతుంది.

**50 శాతం సీట్లపెంపుదలే ఉత్తమ విధానం.. 2026 జనాభా లెక్కలు అమలైతే మరింతగా నష్టపోతాం**

మాజీ సీఎం వైఎస్ జగన్ తన వాదనను బలపరిచే గణాంకాలను పట్టిక రూపంలో కూడా తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పునర్విభజన బిల్లులో చెబుతున్నట్టుగా 50 శాతం సీట్లు పెరిగితే దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల ఎలా ఉంటుంది..? అదే 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు ఎంతగా తగ్గుతాయో వివరించారు.

# ఢిల్లీపై పోరాడి గెలిచాం

చెన్నై, ఏప్రిల్ 17: లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందించారు. ఢిల్లీని తమిళనాడు ఓడించింది: తమిళనాడు పోరాడింది, తమిళనాడు గెలిచింది అని శుక్రవారం స్టాలిన్ ప్రకటించారు. దక్షిణాది ఐక్యంగా నిలిచి తమ గళాన్ని వినిపించడంతో ప్రజాస్వామ్యం విజయం సాధించిందని ఆయన అన్నారు. ఇది ట్రైలర్ మాత్రమేనని, వచ్చే ఎన్నికల్లోనూ విజయం తమదేనని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును వేరే చేసి లోక్‌సభలో ఆమోదించే అవకాశం ఉన్నప్పటికీ కేంద్రం అలా చేయలేదని, దీన్ని మహిళలు గమనిస్తున్నారని స్టాలిన్ చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రతిని తాను దగ్ధం చేస్తున్న ఫొటోను సోషల్ మీడియాలో స్టాలిన్ పోస్టు చేశారు. పార్లమెంట్‌లో బిల్లు వీగిపోయిన వెంటనే డీఎంకే నాయకులు స్వీట్లు పంచుతూ బాణసంచా కాల్చి తమ ఆనందం ప్రకటించారు. ఆ అహంకారానికి మద్దతిచ్చే బానిసలతోపాటు ఢిల్లీ అహంకారాన్ని ఏప్రిల్ 23న (అసెంబ్లీ ఎన్నికల పోలింగ్) ఓడిస్తామని స్టాలిన్ చెప్పారు. ఐక్యంగా నిలిచిన విపక్ష పార్టీలన్నిటికీ నా హృదయపూర్వక అభినందనలు అని ఓ ప్రకటనలో స్టాలిన్ పేర్కొన్నారు.



# అనకాపల్లి జిల్లాల్లో భూకంపం!

**అమరావతి:ఏప్రిల్ 17 :** ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా ఎలమంచిలి పరిస రాల ప్రాంతాల్లో స్వల్ప భూకంపం సంభవించింది, అర్ధరాత్రి 12: 30 గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు... భూమి కంపించిం దని, స్థానికులు చెబుతున్నారు. ఎలమంచిలి పట్ట ణంతో పాటు..మండలం లోని పలు గ్రామాల్లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రాంబిల్లి మండలం పరిసర ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12:30 గంటల సమయం లో ఈ ప్రకంపనలు సంభ వించాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.7గా నమోదైనట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించా రు. నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ఇప్పటివరకు ఎటువంటి ఆస్తి నష్టం లేదా ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. స్థానిక అధికారులు మరియు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందాలు ప్రకంపనలకు గల కారణా లను విశ్లేషిస్తున్నాయి. ఇలాంటి తక్కువ తీవ్రత గల ప్రకంపనలు సాధా రణంగా ఆందోళన చెందా ల్సిన విషయం కాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# కార్మిక ఉద్యమలకు ఏఐటీయూసీ కేంద్ర బిందువు

**-యామాల మధు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి**




దేశంలో కార్మిక, రైతాంగ, ఉద్యోగ వర్గాలపై కొనసాగుతున్న అన్యాయ విధానాలకు వ్యతిరేకంగా తిరుపతిలో నిర్వహించనున్న మహాసభలు ఉద్యమాలకు దిశా నిర్దేశం చేయనున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యామాల మధు స్పష్టం చేశారు. సంతపేట ఏఐటీయూసీ ఆఫీస్ నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహాసభ ల పోస్టర్ ను ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ ఈ నెల 26,27,28 తేదీలలో తిరుపతిలో జరుగు మహాసభ లను విజయవంతం చేయాలనీ పిలుపునించారు. 26వ తేదీ సాయంత్రం తిరుపతి ఆర్టీసీ బస్టెండ్ సమీపం నుంచి మహా ప్రదర్శన నిర్వహించి, అనంతరం ఇందిరా మైదానంలో బహిరంగ సభ నిర్వహించినట్లు వివరించారు. బహిరంగ సభకు జిల్లా నుండి వేలాదిగా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలి. ఈ బహిరంగ సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అమర్ జిత్ కౌర్, సిపిఐ రాష్ట్రా కార్యదర్శి కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐటీయూసీ జాతీయ రాష్ట్ర నాయకులు సిపిఐ నాయకులు హాజరవుతారు. మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర మహాసభల లో సమర శంఖం పూరిస్తాం. ఈ మహాసభలలో జాతీయస్థాయి నాయకులు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నారు. కష్టపడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి కొత్త హక్కులను సాధించుకోవడానికి సమగ్ర ఉద్యమాలు అవసరం. ఈ కార్యక్రంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి. సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ఉపధ్యక్షులు షేక్ ముక్తియర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి. లీలామోహన్, సిపిఐ నాయకులు పి. జిలాని ఖాన్ ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

# భార్య

ఒకే జన్మలో
పెళ్ళైన మహిళ మాత్రమే
రెండు జీవితాలను చూస్తుంది
వాటిని అనుభవిస్తుంది
పుట్టింటి వాళ్ళు మాత్రం
ఏదో చుట్టం చూపుగా పిలుస్తారు
దాన్ని అలుసుగా అత్తింటి వాళ్ళేమో
చిన్న చూపు చూస్తారు
మగాడి మౌనాన్ని కూడా
అర్థం చేసుకునే భార్యకు
ఏమిచ్చినా ఋణం తీరదు
మగాడు ఏ ఏ జన్మలో
చేసుకున్న పుణ్యమో
ఈజన్మలో భార్య రూపంలో
మగాడికి తోడు దొరికింది
అందుకే... ఓ మగాడా!
భార్యకు భారమైన చోట
భావాలను పంచుకోవద్దు
నిన్ను కోపంలో దూరం పెట్టినా
దగ్గర కావాలని ప్రత్నించు
భార్యతో బాధలే కాకుండా
కష్ట సుఖాలను కూడా పంచుకో!
నిందించడం మానేసి
నిజాయితీని గుర్తుంచుకో!
భార్యతో పంచుకునే క్షణాలు
ఆత్మాభిమానం మించిన ధనం
ఈ ప్రపంచంలో మరొకటి
ఉంటుందని నువ్వు భ్రమపడకు.



**రచన : కవిరాజు మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## ఘనంగా తెలుగు రంగస్థల దినోత్సవం



కందుకూరి సాహిత్యంలో కొత్త వెలుగులు నింపి పునరుజ్జీవం తెచ్చారని మేరా యువ భారత్ జిల్లా అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి పేర్కొన్నారు. అక్షయ్ సొసైటి ఫర్ హెల్త్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నెల్లూరు శ్రీ రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనం ( టౌనుహాలు )నందు కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని తెలుగు రంగస్థల దినోత్సవం సందర్భంగా కళాకారులకు కందుకూరి విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. కందుకూరి విశిష్ట సేవా పురస్కార గ్రహీతలు పి.శ్రీనివాసులు రెడ్డి, లోకా అపరాజిత, సింధూరి పవన్ కుమార్, పెనుబడి రఘు రాములను శాలువా, మాల, మొమెంటో, మెడల్, ప్రశంసాపత్రం, కిరీట దారణతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎస్.వి.రమేష్ బాబు, అందే శ్రీనివాసులు, యనమల నాగేశ్వరరావు, ఎ.జయప్రకాశ్, డాక్టర్ రాచపాలెం రఘు, డాక్టర్ చీదరాల చెన్నయ్య, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, జోష్న, శ్రీకర్ రెడ్డి, ఓంకారం వెంకటేశ్వర్లు, కేతా సుధాకర్ రెడ్డి, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లాలో నకిలీ పాల గుట్టురట్టు : ఆయిల్, షుగర్, సాల్ట్‌తో తయారీ

**దగదర్తి విజ్ఞాన పత్రిక :** ఆరోగ్యాన్ని ప్రసాదించాల్సిన పాలే విషతుల్యమవుతున్నాయి. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా కొందరు కేటుగాళ్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆయిల్, పంచదార, ఉప్పు వంటి పదార్థాలను ఉపయోగించి కృత్రిమంగా పాలను తయారు చేస్తున్న వైనం నెల్లూరు జిల్లాలో వెలుగుచూసింది దగదర్తి మండలం, దామవరం గ్రామంలోని ఓ ఇంట్లో నకిలీ పాలను తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో అధికారులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. అక్కడ మూడు క్యాన్లలో సుమారు 90 లీటర్ల పాలు సిద్ధంగా ఉండటాన్ని గమనించారు.

**తయారీ విధానం ఇలా. :** విచారణలో నిందితులు ఈ పాలను ఎలా తయారు చేస్తున్నారో వివరించారు. మిక్సీలో ఆయిల్, షుగర్, సాల్ట్ వంటి పదార్థాలను వేసి కలిపి, పాలను కల్తీ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చూడటానికి అచ్చం పాలలాగే కనిపించేలా ఈ మిశ్రమాన్ని సిద్ధం చేస్తారని తెలిసింది.



**డైరీకి సరఫరా :** ఇలా కల్తీ చేసిన పాలను చందశేఖరపురంలోని విఘ్నేశ్వర డైరీకి క్రమం తప్పకుండా సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో అధికారులు అక్కడ ఉన్న మూడు పాల క్యాన్ల నుండి నమూనాలను సేకరించారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు వెల్లడించారు.

**హెచ్చరిక:** ఆహార పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## ఫైర్ స్టేషన్ ఆఫీసర్,సిబ్బంది ని సత్కరించిన వాసవి క్లబ్ సేవన్ లయన్స్,వాసవి క్లబ్ వనిత లెజండ్స్



**విజ్ఞాన్ న్యూస్ ..కావలి :** గురువారము ఉదయము 10 గంటలకు ఫైర్ డిపార్ట్మెంట్ వారోత్సవాల సందర్భంగా, మరియు క్యాలండర్ అఫ్ ఈవెంట్స్ లో అగ్నిమపాక దళ సిబ్బందిని వారి సేవలను గుర్తించి ప్రశంసించాలనే ఆలోచనతో ఫైర్ డిపార్ట్మెంట్ ఆఫీషర్ శ్రీనివాస్ రెడ్డి,వారి సిబ్బంది తదితరుల సమక్షంలో అగ్ని వల్ల ఏదైనా ప్రమాదం వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దాని గురించి, ప్రమాదల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్త లు మొదలగు వాటి గురించి అవగహనా సదస్సు వాసవి క్లబ్ సెవెన్ లయన్స్ మరియు వాసవి వనిత లెజండ్స్ కావలి వారు సంయుక్తంగా కలిసి నిర్వహించడం జరిగింది. జోన్ చైర్మన్ దుగ్గిశెట్టి హేమలత, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ పాదర్తినాగరాజు ఆధ్వర్యంలో మన వాసవి వనిత లెజండ్స్ డి.ఓ పానుగంటి నిరూప, సెక్రటరీ పెట్టుగాని సుధారాణి, ట్రెసరర్ తాత శైలజ, జోన్ సెక్రటరీ భవనాసి సువర్ణ, జాయింట్ సెక్రటరీ భావన ,వైస్ ప్రెసిడెంట్ శనగపల్లి గీతా,తటవర్తి జ్యోతి అందరూ మరియు సెవెన్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వేమూరి శ్రీనివాసులు,సెక్రటరీ పెసల పవన్,కోశాధికారి రాజా సుబ్బారావు గాధంశెట్టి వేణు గోపాల్,ఏల్చూరి రవి, పెట్టుగాని రమేష్.ఇడిముక్కల శ్రీధర్ సభ్యులు పై కార్యక్రమంలో పాల్గొని దిగ్విజయం చేసినందుకు అందరికి ధన్యవాదములు తెలియజేసిన వాసవి క్లబ్ నిర్వహకులు.

# ఆర్టీసీ గ్యారేజ్ లో గుండె జబ్బులపై అవగాహనా సదస్సు

**కావలి విజ్ఞాన పత్రిక :** మద్యపానం,దూమపానం వంటి దుర్వసనాలకు దూరంగా ఉండడం, సకాలంలో వైద్యుని సంప్రదించడం ద్వారా గుండెను కాపాడుకోవచ్చని నెల్లూరు ఆర్టీసీ డిస్పెన్సరీ వైద్యాధికారిణి డాక్టర్ యస్కె షమ్మా పేర్కొన్నారు. శుక్రవారం కావలి ఆర్టీసీ గ్యారేజ్ నందు,నెల్లూరు ఆర్టీసీ డిస్పెన్సరీ బృందం వారిచే" గుండె సంబంధ వ్యాధులు, వాటి యొక్క నివారణ మరియు చికిత్స గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ షమ్మా మాట్లాడుతూ, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి ,వచ్చిన తర్వాత ఏ విధమైన విధానాలను పాటించాలి అను అంశాల మీద సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కావలి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశం మేరకు కావలి డిపోలో కార్మికులకు ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రతీ ఉద్యోగి ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నెల్లూరు ఆర్టీసీ డిస్పెన్సరీకి వెళ్లి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని,



వైద్యసలహాలు పొంది, పాటించాలని అన్నారు. కార్మికులు విశ్రాంతి సమయంలో ఇతర పనులు పెట్టుకోకూడదని, కనీసం 6 నుండి 8 గంటలు నిద్రకు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్టీసీ డిస్పెన్సరీ వైద్య బృందం, అసిస్టెంట్ మేనేజర్ ( ట్రాఫిక్ ) యం కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ ( మెకానికల్ ) బి మల్లికార్జున,ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అన్నెంలతా రెడ్డి

**నెల్లూరు.ఏప్రియల్..(విజ్ఞాన్ ప్రతినిధి)....**



వైసీపీ పార్టీ రాష్ట్రకార్యవర్గం లో నెల్లూరు జిల్లా నర్వేపల్లి నియోజకవర్గం కు చెందిన అన్నెం లత రెడ్డి నీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా వైసీపీ అధిష్టానం నీయమించింది.. లత రెడ్డి వైసీపీ చేపట్టే కార్యక్రమాలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు రాష్ట్ర స్తాయి లో గుర్తించి పార్టీ లో బాధ్యతలు ఇచ్చిన మాజీ మంత్రి వర్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి కీ మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి కీ కృతజ్ఞతలు తెలిపారు .

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం 17వ విడత సామజిక తనిఖీ ప్రజావేదిక

**ఏసిపోగు బాబు విజ్ఞాన దిన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు** ఆత్మకూరు మండలం లోని రూరల్ 21 గ్రామ పంచాయతీలలో జరిగిన 2024.2025 ఆర్థికసంవత్సరం నకు సంబంధించి ఉపాధిహామీ పథకం నకు సంబంధించి 910 పనులకుగాను కూలీలకు 6,61,87503 రూపాయలు మెటీరియలకు సంబంధించి 55,28468 రూపాయలకు ఖర్చు చేయడం జరిగింది. అదేవిధంగా పంచాయతీరాజ్ కు సంబంధించి 69 పనులుకు గాను 9975రూపాయలు కూలీలకు మరియు మెటీరియలకు 2,62,45466 రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. అదేవిదంగా =ఔా నకు సంబందించి 1పనికి గాను 299 రూపాయలు మరియు సోషల్ ఫారెస్ట్ కు సంబందించి 3పనులుకు గాను మెటీరియల్ క్రింద 12,68,240 రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం లో జరిగిన ఈ పనులన్నింటి సంబంధించి 17 వ రౌండ్ సామజిక తనిఖీ బృందం ఆయా గ్రామాలలో పర్యటించి, పనులు వారీగా తనిఖీ చేసి ఖర్చుల వివరములు, పనుల నాణ్యత మరియు పారదర్శకతను పరిశీలించి, లోపాలను గుర్తించి, నివేదికులు తయారుచేసి గ్రామస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి, పంచాయతీ పాలకవర్గం మరియు ప్రజలు, కూలీలు ముందు చదివి వినిపించడం జరుగుతుంది.. తదుపరి చివరిగా ఈరోజు అనగా 17/4/2026 దిన మండల ప్రజా పరిషత్ ఆవరణంలో ఎంపీడీఓ పి. రఫీఖాన్ అధ్యక్షతన మండలప్రజా పరిషత్ చైర్మన్ కేతా




వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావేదిక ఏర్పాటు చేయగా, పోగ్రామ్ ప్రొసీడింగ్స్ ఆఫీసర్ గా జిల్లా నీటి యాజమాన్య సంస్థ పధక సమాచాలాకులు శ్రీ గంగభవాని గారు హాజరై సామజిక తనిఖీ బృందం వారు వివరించిన నివేదికను పరిశీలించి ఉపాధిహామీ పథకం నకు సంబందించిన పనులుకు గాను, మండలం లోని 21పంచాయతీలకు గాను,33073 రూపాయలు రికవరీ చేయుటకు సంబంధిత బాద్యులకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, సామజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ పి. రవి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి కిషోర్ బాబు, టిడిపిపార్టీ ఆత్మకూరు రూరల్ మండల కన్వినర్ సుంకర పెంచలచౌదరి,టిడిపి నాయుకులు కేతా విజయభాస్కర్ రెడ్డి మరియు ాూరాా మధు,మరియు ఎం. శిరీషా, జుజ శ్రీనివాసులు,జానకి రాాా లు మరియు అన్ని గ్రామ పంచాయతీ ల ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు సిబ్బింది, మరియు ప్రజలు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాన మంత్రి చంద్రశేఖర్ 100వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన శ్రీ బీద మస్తాన్ రావు యాదవ్



**కావలి, విజ్ఞాన్ న్యూస్ :** మాజీ ప్రధాన మంత్రి చంద్రశేఖర్ 100వ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని రాజ్ ఘాట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ పాల్గొని ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ రాజకీయ చరిత్రలో చంద్రశేఖర్ సత్యనిష్ఠ, ధైర్యం మరియు ప్రజాసేవకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సామాన్య ప్రజల సమస్యలపై ఆయన చూపిన కట్టుబాటు, నిస్వార్థ సేవ రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ముఖ్యంగా యువతకు ఆయన జీవితం ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

# పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడే ఆలయాలు ప్రభుత్వ బడులు

**ఉద్ఘాటించిన యం. ఇ. ఒ బండి. గోవిందయ్య.**





**కావలి, విజ్ఞాన్ న్యూస్ :** కావలి మండలంలోని తుమ్మలపెంట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం మనబడి జ్ఞానబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి మండల విద్యాశాఖాధికారి బండి.గోవిందయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాలబాలికలతో కలసి నిర్వహించిన ర్యాలీలో ప్రభుత్వబడి-జ్ఞాననిధి నినాదాలతో ఆయన హోరెత్తించారు. కరపత్రాలు పంపిణీచేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలబాలికల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడే ఆలయాలు ప్రభుత్వ బడులని ఉద్ఘాటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమఫలాలు, అవకాశాలతో పిల్లలను బాధ్యత గా చదివించాలని తల్లిదండ్రులకు హితవు పలికారు. ఇందులోభాగంగా తుమ్మలపెంట యు. పిలో 12 మంది విద్యార్థులు ఒకటవతరగతిలో చేరినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. ఝాన్సీ కృపమ్మ తెలియజేశారు . యం. ఇ. ఒ మాట్లాడుతూ కావలి మండలంలో మనబడి జ్ఞాన బాట కార్యక్రమాన్ని అధిక పాఠశాలలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషితో ఇప్పటివరకు 200 మంది కి పైగా బాలబాలికలను ప్రభుత్వ బడిలో చేర్పించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మనబడి జ్ఞాన బాట కార్యక్రమాన్ని మండలంలోని వంద శాతం పాఠశాలల్లో విధిగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయిని కె. ఝాన్సీ కృపమ్మ, ఉపాధ్యాయినీలు ఇ. వి. లలిత, పి. శ్రీదేవి, బి. హంసవేణి, టి. మంజుల, జి. వరమ్మ, విద్యాకమిటీ ఛైర్మెన్ ఎ. రవి, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లి దండ్రులు, తదితరులు పాల్గొన్నారు. తదుపరి పెదనట్టు, పూలదొరువు పాఠశాలలను తనిఖీ చేసినట్లు తెలుస్తోంది.

# ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్నముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**బాబు ఏసిపోగు విజ్ఞాన దిన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు :** ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆత్మకూరులో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సన్నహాలు చేస్తూ ఉండగా అక్కడ ఏర్పాట్లును నేడు మంత్రి ఆనం పరిశీలించారు.. మార్కెటింగ్ కమిటీ సమీపంలో ఉండే ప్రాంగణంలో భారీ సెట్టింగ్ లతో ఆలయ గోపురం నిర్మిస్తున్నారు. ఇక్కడే హోమ కార్యక్రమాలు కూడా నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ చేపట్టిన ఆలయ గోపురం పనులు ఇతర నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి తమ పార్టీ నేతలకు పలు సూచనలు చేశారు.. అనంతరం పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 20వ తేదీన ముఖ్యమంత్రి జన్మదిన సందర్భంగా ఇక్కడ చేపట్టనున్న పలు కార్యక్రమాలకు సంబంధించి దిశా నిర్దేశ చేస్తూ ఆ రోజు నిర్వహించే కార్యక్రమానికి అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో బి.పావని, డిఎస్పి కే వేణుగోపాల్ కూటమి నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

# ప్రజా వైద్యులు, జనం మనిషి డాక్టర్ రామ్

**.-డాక్టర్లకు ఆదర్శప్రాయుడు డాక్టర్ రామ్.**



**కావలి, విజ్ఞాన్ న్యూస్ :** శుక్రవారం రోజున డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో కావలి రాజీవ్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెల్లూరు రామచంద్రారెడ్డిప్రజావైద్యశాల వ్యవస్థాపకుడు డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (డాక్టర్ రామ్)వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యులు మేఘనాథ్ చౌదరి,డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, లోకఅదాలత్ సభ్యుడు యం.మాలకొండారెడ్డి, పి. హెచ్.సి. కమ్యూనిటి ఆర్గనైజర్ సునీత, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.డాక్టర్ మేఘనాథ చౌదరి మాట్లాడుతూ వైద్యులకు ఆదర్శప్రాయుడు డాక్టర్ రామచంద్ర రెడ్డిని, డాక్టర్హోరామ్ ప్రతిభావంతుడైన వైద్యుడని, ఉపాధ్యాయులకు, యువకులకు, సాంఘిక కార్యకర్తలకు ఆయన ప్రథమచికిత్స నేర్పించారని , తద్వారా వేలాది ప్రాణాలను రక్షించగలిగారని కొనియాడారు.తదుపరి వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. దొడ్ల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్హోరామ్ మనస్సున్నహోడాక్టర్, పేదలపెన్నిధి,అభ్యుదయవాది, మారుమూల గ్రామాలలోని ప్రజలకు వైద్యం అందాలని బేర్ ఫుట్హోడాక్టర్లను తయారు చేసి ఎందరో పేద ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు. కూనం తాతిరెడ్డి మాట్లాడుతూహోడాక్టర్హోరామ్ ఒక ప్రజావైద్యుడని, జనం మనిషి అని, కొన్ని వేలమంది పేదలకు ఉచితంగా వైద్యం అందించిన మానవతామూర్తి అని,డి.ఆర్ కి స్ఫూర్తి అని, బీడీ కార్మికుల, రిక్షా కార్మికుల న్యాయమైన కోరికల కోసం అనేక పోరాటాలు చేసి, వారికి న్యాయం చేశాడని నివాళులు అర్పించారు.మాలకొండారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రామ్ పేదల పెన్నిధిని, ఎందరో వైద్యులు అనేక ప్రాంతాలలో డాక్టర్ రామ్ ఆశయాలతో ప్రజా వైద్యశాలలను స్థాపించి ప్రజలకు వైద్యసేవలను అందించారని నివాళులు అర్పించారు.

# ప్రజాదర్బార్‌కు విశేష స్పందన - ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల స్వీకరణ..!

**-ప్రజల సమస్యలే ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే కాకర్ల స్పష్టం..!**
**-ప్రజలకు చేరువగా పాలన అందించాలనేదే లక్ష్యం - పారదర్శకతతో పని చేయాలని అధికారులకు పిలుపు...!**
**-వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల ప్రజలు భారీగా హాజరు..!**







**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 17** తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం నందు గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత సమీపంగా పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ (గ్రా+=వా -- ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినిపించి, వాటికి తక్షణ పరిష్కారం చూపించే దిశగా ఒక సమగ్ర వేదికగా నిలిచింది. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసిల్దారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, డిఆర్డిఏ సిబ్బంది మరియు ఇతర సంబంధిత విభాగాల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించారు. వివిధ శాఖల సమన్వయంతో సమస్యల పరిష్కారం వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.వింజమూరు, కలిగిరి, కొండాపురం మరియు జలదంకి మండలాలకు చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కి సమర్పించారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన కాకర్ల సురేష్ , సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించ వలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన ధ్యేయం" అని పేర్కొంటూ, ప్రతి అధికారి బాధ్యతతో, పారదర్శకంగా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తేనే ప్రజల సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గరగా ఉంటూ, వారి అవసరాలు, సమస్యలు తెలుసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలనే సంకల్పాన్ని మరోసారి ప్రతిబింబించింది. ప్రజల నుంచి కూడా ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

# జనగణనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం దేశాభివృద్ధికి బలమైన పునాది : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**-ఆత్మకూరులో స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్)లో ఆన్లైన్ పోర్టల్ ద్వారా వివరాలను స్వచ్ఛందంగా నమోదు చేసుకున్న మంత్రి ఆనం**
**-ప్రజలందరూ జనగణన కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపు**



**ఆత్మకూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ , ఏప్రిల్ 17 :** దేశ ప్రగతికి జనగణన అత్యంత అవసరమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆత్మకూరులో జనగణన కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమురేషన్) ప్రక్రియలో ఆన్లైన్ పోర్టల్ ద్వారా తన వివరాలను స్వచ్ఛందంగా నమోదు చేసుకున్నారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆత్మకూరు తాసిల్దార్ మంత్రి కి వివరించగా మంత్రి ఆనం స్వయంగా ఒవ.ఖివఅంబం.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా వివరాలను నమోదు చేశారు. జనగణనలో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని జిల్లా కలెక్టర్ తరపున ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దార్ పద్మజ ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు, పేదల అభ్యున్నతికి జనగణన కీలకమని ఆయన పేర్కొన్నారు. 2011 తర్వాత మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జనగణన కార్యక్రమాన్ని ప్రారంభించడం శుభపరిణామమని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని తెలిపారు. దేశంలోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న ప్రతి వ్యక్తి కూడా తమ కుటుంబ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ జనాభా లెక్కలు సక్రమంగా నమోదు కావడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలు, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపనకు దోహదపడుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లో మన దేశ స్థానాన్ని సుస్థిరం చేయడానికి ఈ జనగణన కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలందరూ పెద్దఎత్తున జనగణనలో పాల్గొని దేశాభివృద్ధికి దృఢమైన పునాది వేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 30 తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్ లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. మే 1 తేదీ నుంచి 30 తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు.

## ఇంటర్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణ సాదించిన పలువురు విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందించిన జిల్లా కలెక్టర్




శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయములోని తిక్కన ప్రాంగణములో సంఘీక సంక్షేమ కాలేజి హాస్టల్ లో ఉంటూ ఉంటూ మొదటి, రెండవ సంవత్సరము ఇంటర్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణ సాదించిన పలువురు విద్యార్దినీ విద్యార్దులకు జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల ప్రసంశా పత్రాలను అందించారు. వారిలో ఆత్మకూరు బాయిస్ హాస్టల్లో ఇంటర్ ప్రదమ సంవత్సరములో (479/500) మార్కులు సాధించిన కే.గణేష్, (473/500) మార్కులు సాధించిన పి.పూజ,నెల్లూరు, మరియు బి.పుష్పలత ( 468/500) , ద్వితీయ సంవత్సరములో యస్.అనూషా(956/1000)టి.సుమతి(934/1000),పి.శ్రీ వేణు (924/1000) లను సముచిత రీతిలో ప్రసంశా పత్రంతో సముచిత రీతిలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.......

## కనిగిరి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సమావేశం




**కనిగిరి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** కనిగిరి నియోజకవర్గంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "జలధార - జలహారతి" 100 రోజుల నీటి సంరక్షణ ఉ భూగర్భ జల పునరుద్ధరణ కార్యక్రమం పై కనిగిరి లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ సునీత మరియు సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్న శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధికారులు పాల్గొన్నారు

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.